క్లుప్తంగా

గ్రంథాలయానికి కంప్యూటర్ బహూకరణ

బోట్‌క్లబ్‌: జిల్లా కేంద్ర గ్రంథాలయానికి సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ కంప్యూటర్‌ను బహూకరించారు. రూ.60 వేలతో వారు ఏర్పాటు చేసిన కంప్యూటర్లను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం కార్యదర్శి ప్రసాద్, విశ్రాంత మున్సిపల్ కమిషనర్ వెన్నపు చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ


సాధించిన పతకాలతో సాయి సనో

కాకినాడ రూరల్: తెలంగాణ మొయినాబాద్‌లో జరిగిన రెండో నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో కాకినాడకు చెందిన ఆర్.సాయి సనో ప్రతిభ చూపాడు. స్థానిక శశికాంత్‌నగర్ భాష్యం స్కూల్‌లో చదువుతున్న ఆ బాలుడు మూడు విభాగాల్లో మొదటి మూడు బహుమతులు సాధించి పతకాలు అందుకున్నాడు. ఈ నెల 18న జరిగిన పోటీలలో 780 మంది విద్యార్థులు పాల్గొనగా తమ విద్యార్థి ప్రతిభ చూపడం అభినందనీయమని స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం సూర్య జ్యోతి అన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ

బోట్‌క్లబ్‌: బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన కుట్టుశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు వీఎస్ఎన్ మూర్తి, భారతి తెలిపారు. తూరంగిలోని ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రామకృష్ణ సత్యవేణి పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన


మహిళల భద్రతపై అవగాహన కల్పిస్తున్న దిశ ఎస్సై లక్ష్మీ

కాకినాడ క్రైం: మహిళలు, బాలికల భద్రతే లక్ష్యంగా స్థానిక దిశ పోలీస్‌స్టేషన్ సీఐ పెద్దిరెడ్డి రామచంద్రరావు ఆధ్వర్యంలో నగరంలో పలు చోట్ల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. విద్యార్థి దశ నుంచే భద్రత అంశాలపై అవగాహన కల్పిస్తే సత్ఫలితాలు ఉంటాయని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సై లక్ష్మి బృందం నగరంలో వివిధ పాఠశాలల్లో విద్యార్థినులకు అవగాహన కలిగిస్తున్నారు. ఇందులో భాగంగా కాకినాడ ఆనందభారతిలో ఉన్న రాజీవ్ గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్‌లో మహిళా చట్టాలు, డయల్ 100, 112, 181, 1091 టోల్ ఫ్రీ నంబర్ల ప్రయోజనాలను సీఐ వివరించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

కరప: మండలంలో జరిగిన వేర్వేరు ఘటనలలో ఇద్దరు మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ ఒకరు, పాముకరచి మరొకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కరప మండలం పెదకొత్తూరు గ్రామానికి చెందిన దాసరి భీమరాజు (28) బుల్‌డోజర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. భీమరాజు ఈనెల 19న పనిమీద మోటార్‌సైకిల్‌పై ఉప్పాడ వెళ్లి, తిరిగి వస్తుండగా వాకాడ వంతెన వద్ద బైక్ స్కిడ్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను జీజీహెచ్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే గురజనాపల్లి గ్రామానికి చెందిన మరుకుర్తి సత్తిబాబు (40) రొయ్యల చెరువుల వద్ద పనిచేస్తుంటాడు. బుధవారం మధ్యాహ్నం అక్కడ కాపలా కాస్తుండగా అతన్ని విషసర్పం కుట్టడంతో అపస్మారక స్థితికి చేరి అక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని కోరుతూ కరప పోలీసు స్టేషన్ వద్ద కొద్దిసేపు ఆందోళనకు దిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గంబూషియా చేపల విడుదల

కాకినాడ క్రైం: దోమల వృద్ధిని నివారణకు యాంటీ లార్వల్ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా మంచినీటి వనరుల్లో గంబూషియా చేపలను విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో నరసింహ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మలేరియా అధికారి భాస్కర రావు ఆధ్వర్యంలో 1.50 లక్షల చేప పిల్లలను నీటి వనరుల్లో విడిచిపెట్టామని తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాల వేళ అప్రమత్తం

కరప: తుపాన్లు, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాలు, అనుకోకుండా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తమై తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని ఎన్‌డీఆర్‌ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందసభ్యులు తెలిపారు. కలెక్టర్ షామోహన్ ఆదేశాల మేరకు విజయవాడలోని ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ ప్రసన్న సూచనల మేరకు ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్‌మోహన్ యాదవ్, సందీప్, కాకినాడ అగ్నిమాపక సిబ్బంది బృందం బుధవారం కరప మండలం ఉప్పలంకలో పర్యటించి ఫామెక్స్ (ఫెమిలియర్ సాంక్షన్ ఎక్సర్‌సైజ్ ప్రోగ్రాం) కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉన్నప్పుడు, గుండెకొట్టుకోవడం ఆగినప్పుడు సీపీఆర్ చేసే పద్ధతిని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఆర్‌ఐ పేపకాయల మాచరావు, గ్రామ కార్యదర్శి డి.దుర్గాభవానీ, వీఆర్వో ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేరుకో రుచి.. తినరా మైమరచి..

- నగరంలో నందడి చేస్తున్న పలావ్ సెంటర్లు
- విభిన్న రుచులతో ఆకట్టుకుంటున్న వ్యాపారులు
- కాకినాడ వాసుల అభిమానాన్ని చూరగొంటున్న వైనం
- రూ.లక్షల్లో సాగుతున్న లావాదేవీలు



కాకినాడ 5 బిల్డింగ్స్ సెంటర్‌లో చిట్టిబాబు కోడిపలావ్


నాగమల్లితోట జంక్షన్‌లో సూరిబాబు కోడి పలావ్



ఆశ్రం స్కూల్ సమీపంలో కొత్తగా సిద్ధమవుతున్న నాయుడు గారి పలావ్

జిహ్వకో రుచి.. పుర్రెకో బుద్ధి అంటారు పెద్దలు. అవును మరి. ఒకరికి నచ్చిన టేస్ట్ మరొకరికి నచ్చకపోవచ్చు. ఎవరి టేస్ట్ వారిది. బిర్యానీ.. పలావ్.. వంకాయ కూర.. పనసపొట్టు కూర ఇలా ఏది చేసినా అవే పేర్లు.. కానీ రుచుల్లోనే తేడా.. వాటిలో వాడే ఇంగ్రేడియన్స్ ఎవరు వేసినా అవే అయినా ప్రాంతాన్ని బట్టి చిన్నపాటి తేడాలు.. అన్నింటికీ మించి వండిన చేతి మహత్యం. ఆహా ఏమి రుచి.. డెలిషియస్ అని మూతి ముప్పై వంకర్లు పెట్టి మురిసి పోతూ చెప్తుంటారు. వంటల్లో కాకలు తీరిన ఎందరినో తోసిరాజని నయా ట్రెండ్స్ పుట్టుకొచ్చాయి. స్థానిక పేర్లతో జతకట్టి పలావ్, బిర్యానీ సెంటర్లు వెలిసి నగరవాసులను ఏ సెంటర్‌కు వెళ్లాలో తేల్చుకోలేని సంబరానికి గురిచేస్తున్నాయి. అవునండీ బాబూ.. మీరూ నగరంలో ఫుడ్ ట్రెండ్స్‌పై ఓ లుక్కేయండి..

కాకినాడ క్రైం: చిట్టిబాబు, సత్తిబాబు, సూరిబాబు, నాయుడుగారు, రెడ్డిగారు, రాజుగారు.. ఈ పేర్లన్నీ ఈ మధ్య కాలంలో కాకినాడ వాసుల చెవుల్లో మార్మోగుతుంటే.. ఆ పేర్లు పలుకుతున్న నోళ్లలో నీళ్లూరుతున్నాయి. నగరంలో ఏ ఇద్దరు కలిసినా ఈ పేర్లపైనే చర్చ. వీళ్లంతా ఎవరనుకుంటున్నారా.. ఇవన్నీ నగరంలో కొత్తగా వెలిసిన పలావ్ సెంటర్ల పేర్లండీ.. అవును.. నాటు కోడితో పాటు పేర్లు జతకట్టాయి. అచ్చమైన తెలుగింటి పేర్లతో ఒకరితో మరొకరికి పోలిక లేని సొంత తయారీ రుచులతో ఎవరికి వారు బిర్యానీ సెంటర్లు పెట్టి రాణిస్తున్నారు. సాంప్రదాయానికి ఆధునికతను జోడించి నగర వాసులకు కొత్త రుచులు పరిచయం చేస్తూ బిర్యానీ విక్రయాల్లో సరికొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. వీరి వ్యాపారాభిలాషకి బిర్యానీ ప్రియుల ఆసక్తి తోడవడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

ఈ మధ్య కాలంలో...

గడచిన ఆరు నెలల్లో చిట్టిబాబు కోడి పలావ్, సత్తిబాబు కోడి పలావ్, సూరిబాబు కోడి పలావ్ వంటి స్థానికత ఉట్టిపడే పేర్లతో బిర్యానీ సెంటర్లు వెలిశాయి. ఇంతకు కొన్నాళ్ల ముందు నాయుడుగారి బిర్యానీ, రెడ్డిగారి బిర్యానీ, రాజుగారి బిర్యానీ అంటూ ఇంకొన్ని హల్‌చల్ చేశాయి. ఇవన్నీ తమకి మాత్రమే ప్రత్యేకతగా మరెక్కడా లభ్యం కాని సొంత రుచుల్లో ఆహార ప్రియులను అలరించాయి. పేర్లలో భిన్నత్వం ఉట్టిపడడంతో ప్రజల్లోనూ మంచి ఆదరణ దక్కుతోంది. తెలిసిన వాళ్లో, పొరుగింటి పేర్లో అన్న భావన వినియోగదారులను ఆకట్టుకుంటోంది.


నోరూరించే చికెన్ వెరైటీలు


సూరిబాబు పులావ్ సెంటర్‌లో బిర్యానీ ప్రియుల రద్దీ

మెయింటెనెన్స్ అదుర్స్..

పెట్టింది లోకల్ పేర్లే అయినా, పలావ్ పాయింట్ల నిర్వహణ మాత్రం పెద్ద నగరాల్లో రెస్టారెంట్లను తలదన్నే రీతిలో ఉంది. అధునాతన నిర్మాణాలతో వీటిని అదరగొడుతున్నారు. ఇంటీరియర్‌ను చూస్తే నోరెళ్లబెట్టాల్సిందే. పార్సిల్ తీసుకునే కాసేపు కొన్ని దుకాణాల్లో ఏసీలో చల్లబడొచ్చు. చేప, రొయ్య, చికెన్ వెరైటీలతో ప్రదర్శిస్తున్న డిస్ప్లే ఆకట్టుకుంటున్నాయి.

నోరూరించే రుచులెన్నో..

ఆయా పలావ్ సెంటర్లలో మెనూ చూస్తే నాటు కోడి సహా పీతలు, రొయ్యలు, మటన్‌లతో లెక్కలేనన్ని, అంతకు ముందు తినని వెరైటీలెన్నో అందులో కనిపిస్తాయి. సాధారణ బిర్యానీలకు భిన్నంగా పలావ్‌లు, బగర్ రైస్, బీజింగ్ ప్రాన్, స్టఫ్డ్‌క్రాబ్, తందూరీ, కౌజు పిట్ట, దూపుడు గొర్రె వీరి మెనూని కిర్రెక్కిస్తున్నాయి. మాంసాహారులకు కాక పుట్టిస్తున్నాయి.

పొరుగు రాష్ట్రాల ఫ్లేవర్లు..

ముఖ్యంగా హైదరాబాద్, చెన్నైల నుంచి వివిధ తయారీ విధానాలను ఈ సెంటర్ల యజమానులు దిగుమతి చేసుకోవడమే కాక వాటికి స్థానికతను జోడిస్తున్నారు. తరచుగా తినే వంటకాలే అయినా తయారీలో ప్రత్యేకతతోనే రుచులు కిక్కెకిస్తున్నాయి. ఎవరికీ చెప్పని రహస్య మసాలా ఫ్లేవర్లు సొంతగా తయారు చేసి బిర్యానీకి అదనపు రుచిని అద్దుతుండడంలో నిర్వాహకుల నైపుణ్యం ఎంతో ఉంది.

వేలల్లో విక్రయాలు.. లక్షల్లో సంపాదన..

కొత్తగా పురుడు పోసుకున్న పలావ్ సెంటర్లు రోజుకి కనిష్ఠంగా 1500 నుంచి గరిష్ఠంగా 2000 బిర్యానీ ప్యాక్‌లను విక్రయిస్తున్నాయి. ఇవి కాకుండా ఇతర ఐటమ్స్ అదనం. వీరి నెల సంపాదన కనీసం రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల మధ్యలో ఉంటుంది.

ఆన్‌లైన్‌లో హల్‌చల్..

తాజాగా కాకినాడ వాసులను అంతులేని రుచులతో అలరిస్తున్న ఈ బిర్యానీ సెంటర్లు అన్నీ ఆన్‌లైన్‌లో షార్ట్స్, రీల్స్ రూపంలో హల్‌చల్ చేస్తున్నాయి. ప్రజల ఆదరణ, రద్దీ చూసి ఫుడ్ బ్లాగర్లు, యూట్యూబర్లు క్యూ కడుతున్నారు. వీటిని తమ ఛానల్స్‌లో పెడుతూ అభిమానుల ఆదరణలు చూరగొంటున్నారు.

పేరుతో ఆకర్షణ రుచితో ఆదరణ



కొత్తగా ఏర్పడిన ఈ ట్రెండ్ ప్రజలను ఆకర్షిస్తోంది. పేరుతో ఆకర్షణ, రుచితో ఆదరణ చేకూరుతాయి. విభిన్నమైన పేర్లతోనే వ్యాపారాలు వృద్ధి చెందవు. పేరుకు తగ్గ నాణ్యత, రుచి ఇవ్వాలి. పలావ్, బిర్యానీలలో సరికొత్త రుచులు పరిచయం చేసేందుకు నిత్యం ప్రయోగాలు, పరిశీలనలు చేస్తూ ఉంటాం. ప్రజలకు సరికొత్త రుచులు పరిచయం చేసేందుకు హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల బిర్యాలనీలపై అధ్యయనం చేస్తున్నాం. వాటికి ఆంధ్రా రుచిని జతచేస్తున్నాం. సరికొత్త రుచులను కాకినాడ వాసులు ఎల్లప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. దీంతో మాలాంటి వ్యాపారవేత్తలకు మంచి ప్రోత్సాహం లభిస్తోంది.

– దుళ్ల సునీల్, చిట్టిబాబు కోడిపలావ్, అధినేత

వెరైటీ పేర్లు.. అదిరే రుచులు..



నాగమల్లితోటలో ఉన్న చిట్టిబాబు, సూరిబాబు కోడి పలావ్ పేరు వెరైటీగా ఉండి ట్రై చేశాం. మంచి రుచితో పలావ్ ఆదరగొట్టారు. చికెన్ సహా నాన్‌వెజ్ వెరైటీలు అన్నీ తక్కువ ధరలకే లభిస్తున్నాయి. వారంలో కనీసం రెండు సార్లు పలావ్ పార్సిళ్లు ఇంటికి తీసుకు వెళ్తా ఉంటాను. చిన్నపిల్లలతో సహా ఇంటిల్లిపాదీ ఇష్టంగా తింటూ ఆస్వాదిస్తున్నారు. ఓ బిజినెస్ మ్యాన్‌గా కొత్త వ్యాపారాలు విజయవంతమవ్వాలని కోరుకుంటాను. వీటిని ఏర్పాటు చేసిన వారంతా యువ వ్యాపార వేత్తలే కావడం అభినందనీయం.

– యజ్జల బాబ్జీ, కాకినాడ

యంత్ర వినియోగంతో పెట్టుబడులు ఆదా

కరప: వరిసాగులో ఆధునీకరణ పద్ధతులను అనుసరిస్తూ, యంత్ర పరికరాలను వినియోగిస్తే పెట్టుబడులు ఆదా అవుతాయని ఎంఏఓ ఏవీ రాజేష్ తెలిపారు. మండలం కొరిపల్లిలో బుధవారం నిర్వహించిన పొలంబడిలో వరిసాగులో మెళకువలు, యంత్ర పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసేందుకు డ్రోన్‌లను వినియోగిస్తే తక్కువ ఖర్చుతో సమయం కూడా కలిసి వస్తుందన్నారు. రైతు పెంకే వీరవెంకటసత్యనారాయణ పొలంలోకి రైతులను తీసుకెళ్లి నానో యూరియా 250 ఎంఎల్, నానో డీఏపీ 250 ఎంఎల్ కలిపి ఒక ఎకరా పొలంలో డ్రోన్‌తో పిచికారీ చేయించి చూపించారు. సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, వీఏఏ ఎస్.స్వర్ణతేజ, ప్రశాంత్, పొలంబడి రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

కేఎంజే కాలువపై ఆక్రమణల తొలగింపు

కరప: మండలం పెనుగుదురు వద్ద కేఎంజే కాలువను ఆనుకుని ఉన్న ఇరిగేషన్ భూమి ఆక్రమణలను బుధవారం ఆ శాఖాధికారులు జేసీబీతో తొలగించారు. ఈనెల 5వ తేదీన పెనుగుదురు గ్రామస్తులు, రైతులు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో ఇరిగేషన్ భూమి ఆక్రమణపై ఫిర్యాదుచేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆ నివేదిక ఆధారంగా ఇరిగేషన్ కొవ్వూరు సెక్షన్ ఏఈఈ ఎన్.నాగభవానీ సిబ్బందితో కల్సి అక్రమంగా నిర్మించిన ప్రహరీని, ర్యాంపును జేసీబీతో తొలగించారు. ఆక్రమణకు గురైన 56 గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఏఈఈ తెలిపారు.

రూరల్ యానిమేటర్ల సంఘం అధ్యక్షురాలిగా గంగాభవాని

కాకినాడ రూరల్: మండల యానిమేటర్ల సంఘ అధ్యక్షురాలిగా కందా గంగాభవాని ఎన్నికయ్యారు. బుధవారం రూరల్ మండలంలో జిల్లా అధ్యక్షురాలు కూడా అయిన ఆమె ఆధ్వర్యంలో మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండలం మహిళా సమాఖ్య స్త్రీ శక్తి భవనంలో 80 మంది యానిమేటర్లు కమిటీగా ఏర్పడ్డారు. రూరల్ మండలం మహిళా మండల సమైక్య స్త్రీ శక్తి భవనం మండల అధ్యక్షురాలుగా కందా గంగాభవాని, కార్యదర్శిగా పరిమి రత్నమాల, ట్రెజరర్‌గా సవరపు పద్మావతి, ఉప అధ్యక్షురాలుగా కొరలబండి నీలవేణి, జాయింట్ సెక్రటరీగా బటే అనంతలక్ష్మి నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా అరుణ, తులసి, వెంకటలక్ష్మి, నాగమణి, శ్రీదేవి, నాగలక్ష్మి, సూర్య లక్ష్మి, లోవకుమారిలను ఎన్నుకున్నారు.

ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు ప్రశంసనీయం


ధాత్రి మదర్స్ బ్రెస్ట్ మిల్క్ బ్యాంకుకు రూ.80 వేల చెక్కును అందిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్‌: ధాత్రి మదర్స్ బ్రెస్ట్ మిల్క్ బ్యాంకు వంటి శాశ్వత ప్రాజెక్టులు ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ సంకల్ప్ సేవలు ప్రశంసనీయమని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈవీ ఈశ్వర కుమార్ అన్నారు. స్థానిక హోటల్‌లో బుధవారం లయన్స్ క్లబ్ సంకల్ప్, లయన్స్ క్లబ్ సహస్ర, లయన్స్ క్లబ్ కాకినాడ శ్రేయస్, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి లయన్స్ క్లబ్ కాకినాడ సంకల్ప్ అధ్యక్షురాలు మెట్ట రాధా సరస్వతి అధ్యక్షత వహించారు. నూతన సభ్యులతో క్లబ్ మాజీ గవర్నర్లు బాదం బాలకృష్ణ, ముంజులూరి విశ్వేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. సంకల్ప క్లబ్ అధ్యక్షురాలు లావణ్య చేపట్టిన ధాత్రి మదర్స్ బ్రెస్ట్ మిల్క్ బ్యాంకుకు రూ.80 వేల చెక్కును, కొబ్బరి మొక్కలు పెంచేందుకు ఆల్ ఇజ్ వెల్ సంస్థ చైర్మన్ కిషోర్‌కు రూ. 40 వేల చెక్కును, ఉమెన్స్ కాలేజీ విద్యార్థులకు రూ. 20వేల స్కాలర్ షిప్‌లు, రెయిన్‌బో చిల్డ్రన్స్ హోమ్‌కు రూ.6 వేల విలువైన నిత్యావసరాలను గవర్నర్ ఈశ్వర్‌కుమార్ చేతుల మీదుగా అందజేసారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ గవర్నర్లు చిట్నీడి శ్రీనివాస్, తలారి రామచంద్రరావు, క్లబ్ సభ్యులు పీఎస్‌టీ లావణ్య, సువర్చల, రత్నమాల, రేవంత్, ప్రసన్న, విమల, పూజా, నిక్షిత పాల్గొన్నారు.

హరిత వనాలకు ప్రాధాన్యం ఇవ్వండి

బోట్‌క్లబ్‌: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందగలమని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. వేంకటేశ్వరరావు అన్నారు. రోటరీ గ్రీన్ సిటీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రతిష్టాపనోత్సవం బుధవారం జరిగింది. క్లబ్ నూతన అధ్యక్షులుగా కందాలం రవీంద్రనాథ్, కార్యదర్శిగా జెట్టి పాండురంగారావు, కోశాధికారిగా అప్పలరాజు కార్యవర్గ సభ్యులుగా భమిడిపాటి శ్రీకృష్ణ, అకెళ్ల ప్రసాద్, ఆదినారాయణ, వర్మ, సూర్యనారాయణ, గణేష్, రవి,దొడ్డి వీరేంద్ర, బ్లూస్టార్ రవి బాధ్యతలు స్వీకరించారు. ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ఒక మొక్క నాటాలని వారు పిలుపిచ్చారు. ఈ సందర్భంగా బీటెక్ విద్యార్థిని ఎం.లతకు గవర్నర్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందజేశారు.

అనాథాశ్రమాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు


నడకుదురులోని వృద్ధాశ్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కరప: వృద్ధులు, పిల్లల అనాథాశ్రమాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి జి.శ్రీనివాసరావు హెచ్చరించారు. అనకాపల్లి జిల్లా లో జరిగిన విషాద ఘటనపై కలెక్టర్ షణ్మోహన్ స్పందించి మండలాల్లోని అనాథాశ్రమాలను పరిశీలించి, అక్కడి వసతులు, వాటి నిర్వహణ తీరుపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు బుధవారం ఎంపీడీఓ కె.అప్పారావుతో కల్సి నడకుదురులోని జనావళి వృద్ధుల, అనాథాశ్రమం, పెనుగుదురు, కరప, గొడ్డటిపాలెం గ్రామాల్లోని పిల్లల ఆశ్రమాలను ఆయా గ్రామాల కార్యదర్శులతో కల్సి పరిశీలించారు.

హామీల అమలుకు ఆరు నెలలు వేచి చూద్దాం

- మాజీ కార్పొరేటర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి


మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు ఇతర వాగ్దానాలను కచ్చితంగా అమలు చేయకపోతే ఆరు నెలల తరువాత ప్రజల పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లకు సూచించారు. బుధవారం తన నివాసంలో నియోజకవర్గానికి చెందిన దాదాపు 25 మంది మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. టీడీపీ ఇచ్చిన హామీలతో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, వాటి అమలుకు కనీసం ఆరు నెలలు వేచి చూద్దామని పేర్కొన్నారు. అప్పటికీ అమలు కాకుంటే ప్రజల తరఫున పోరాడి ఆయా పథకాలను అందించాల్సి ఉందన్నారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వంలోని పలువురి నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని, అయితే పార్టీ శ్రేణులు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. సమావేశానికి హాజరైన పలువురు మాజీ కార్పొరేటర్లు భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పార్టీ నాయకురాలు మాకినీడి శేషుకుమారితో పాటు, అన్ని డివిజన్ల నుంచి మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు.

కాకినాడ డీఎస్పీగా రఘువీర్



కాకినాడ క్రైం: కాకినాడ నగర డీఎస్పీగా విష్ణు రఘువీర్ నియమితులయ్యారు. 1991 ఎస్‌ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన స్వస్థలం అనంతపురం. కడప జిల్లాలో తొలి పోస్టింగ్ పొందిన ఆయన అదే హోదాలో 2000 సంవత్సరంలో దేశం తరఫున యునైటెడ్ నేషన్స్ మిషన్ ఇన్ కుసవోలో భాగంగా ఏడాది పాటు యుగోస్లావియాలో 46 దేశాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులకు ట్రైనర్‌గా వ్యవహరించారు. అనంతరం 2003లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నది పొంది హైదరాబాద్‌లో సీబీఐలోని ఏసీబీ వింగ్‌లో ఐదేళ్లు, అక్కడి నుంచి బదిలీపై అనంతపురం జిల్లా తాడిపత్రిలో సీఐగా, 2009లో విశాఖ రేంజ్‌కు బదిలీ అయ్యారు. అనంతరం 2019లో డీఎస్పీగా పదోన్నతి పొంది విజయనగరం ఏసీబీ డీఎస్పీగా పనిచేశారు. రెండేళ్లు పనిచేసి, ఒక ఏడాది వీఆర్‌లో ఉన్న అనంతరం చిత్తూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా రఘువీర్‌ను నియమించారు. అక్కడే 2023 వరకు కొనసాగి, ఎన్నికల వేళ కమిషన్ చేపట్టిన బదిలీల్లో రఘువీర్‌ను పలమనేరుకు పంపారు. అక్కడే డీఎస్పీగా కొనసాగుతున్న ఆయన సాధారణ బదిలీలో భాగంగా కాకినాడకు వస్తున్నారు. శుక్రవారం ఆయన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

జూడాల నిరసనకు వైఎస్సార్ సీపీ మద్దతు


జూనియర్ డాక్టర్లకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

కాకినాడ క్రైం: కలకత్తా వైద్య విద్యార్థిని అత్యాచారం, హత్య ఘటనలో వైద్యులు, వైద్య విద్యార్థుల నిరసనలు 9వ రోజుకు చేరాయి. జీజీహెచ్‌లో మూడో రోజు నిర్వహించిన శిబిరాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించారు. పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న ఆధ్వర్యంలో నాయకులు పార్టీ తరఫున మద్దతు తెలిపారు. శివ ప్రసన్న మాట్లాడుతూ మాజీ ఎంఎల్‌ఏ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మార్గనిర్దేశంలో వైద్యుల నిరసనకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ప్రాణాలను రక్షించే వైద్యుల ప్రాణాలే ప్రస్తుతం ప్రమాదంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ పని చేసే ప్రదేశాల్లో మహిళలకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వైద్యులకు సంఘీభావం తెలిపిన వారిలో ఏఎంసీ మాజీ చైర్ పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పార్టీ మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

కోల్‌కతా ఘటనలో నిందితులను శిక్షించాలి

కాకినాడ సిటీ: కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచారం ఘటనపై నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేశారు. జూనియర్ డాక్టర్లు ప్రభుత్వాసుపత్రిలో నిర్వహిస్తున్న శిబిరానికి వారు చేరుకుని సంఘీభావం ప్రకటించారు. దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలని, అత్యాచార నిందితులను, వారిని కాపాడాలనుకునే వారికి కఠిన కారాగార శిక్ష విధించాలని నినదించారు. సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ బెంగాల్ ప్రభుత్వం నిందితులను రక్షించేందుకు ప్రయత్నిస్తోందన్న విషయాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నలలో స్పష్టమైందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మలకా రమణ, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, షేక్ పద్మ, సక్కెళ్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు, జీవా, టి.రాజా తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న జోసఫ్ క్రాస్టో

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో బుధవారం విదేశీ వర్సిటీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో విదేశీ విద్యపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా సౌత్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ మార్కెటింగ్ డైరెక్టర్ జోసఫ్ క్రాస్టో హాజరై మాట్లాడుతూ 125 ఏళ్ల చరిత్ర కలిగిన అమెరికాలో సౌత్ యూనివర్సిటీ అనేక మంది విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దిందని, ఫ్లోరిడా రాష్ట్రం టంపాలో ఒకటి, జార్జియా రాష్ట్రం సవన్నాలో మరో క్యాంపస్ ఉందన్నారు. బిజినెస్, కంప్యూటర్ సైన్స్, హెల్త్ సైన్స్ విభాగాలకు సంబంధించి కోర్సులు అందిస్తున్నామన్నారు. జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ప్రపంచంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో ప్రవేశాలు కల్పించి అనేక అవకాశాలు కల్పిస్తామని, ఇటువంటి అవకాశాలు అందిపుచ్చుకుని తల్లిదండ్రులు, మాతృభూమికి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ ఫారెన్ వర్సిటీ డైరెక్టర్ స్వర్ణకుమారి, ఎక్సెల్లా ఎడ్యుకేషన్ గ్రూప్ ప్రతినిధులు కాంతికిరణ్, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కరపలో బంద్ పాక్షికం


కరపలో ర్యాలీ చేస్తున్న ఎస్సీ నాయకులు

కరప: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును నిరసిస్తూ వివిధ దళిత సంఘాలు నిర్వహించిన బంద్ మండలంలో పాక్షికంగా జరిగింది. మండల అంబేడ్కర్ యువజన సేవాసంఘం, మండల ఎస్సీ నాయకులు ముందురోజు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను, ప్రభుత్వ కార్యాలయాలను, వ్యాపార సంస్థలను కలిసి బంద్‌కు సహకరించాలని కోరారు. దీంతో వారంతా బంద్ పాటించారు. మండల యువజన సేవా సంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు, కరప, నడకుదురు, యండమూరు గ్రామసర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, డేగల లలితకుమారి, మార్నెళ్ల శివ, మండల ఎస్సీ నాయకులు సాదే లోహిదాస్, మార్నెళ్ల వెంకటరమణ, సవిలే రాజేష్, తదితరులు బుధవారం కరప చేరుకుని పీహెచ్‌సీకి ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వారు ర్యాలీ నిర్వహించారు. మార్కెట్‌సెంటర్‌లో మానవహారంగా బైఠాయించడంతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. మధ్యాహ్నం నుంచి వ్యాపార సంస్థలు తెరుచుకోగా, ఆటోలు, ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు డైరీఫారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈ ఎన్.ఉదయ భాస్కర్ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని డైరీఫారం, దుమ్ములపేట, పళ్లంరాజునగర్, సాంబమూర్తి నగర్, అయోధ్యనగర్, రాజీవ్‌గృహకల్ప, రెవెన్యూ కాలనీ, సత్యనగర్, స్వర్ణాంధ్రకాలనీ, ఇందిరానగర్, గణేష్‌కాలనీ, జ్యోతుల కాలనీ, టిడ్కో అపార్ట్‌మెంట్ల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే పవర్ హౌస్ సబ్‌స్టేషన్ పరిధిలో బాలాజీచెరువు, డీఎంఎహెచ్‌వో కార్యాలయ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఆయా ఫీడర్ల పరిధిలోని సాలిపేట, జవహర్‌వీధి, బాలాజీ చెరువు, టీడీపీ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు పీఆర్ కళాశాల రోడ్, వెంపటివారి వీధి, కొమ్మిరెడ్డివారివీధి, అవసరాల వారి వీధి, పిండిప్రోలువారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన చెప్పారు.

డ్రైవర్స్‌కాలనీ పరిధిలో...

డ్రైవర్స్‌కాలనీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మహాలక్ష్మినగర్, లక్ష్మీనగర్, నాయక్‌నగర్, సాయినగర్, డ్రైవర్స్‌కాలనీ, అల్లూరి సీతారామరాజుకాలనీ, పగడాలపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సముద్రంలో పడి కూలి గల్లంతు


రాచర్ల కృష్ణ(ఫైల్)

కాకినాడ క్రైం: సముద్రంలో పడవపై బస్తాలు మోసేందుకు వెళ్లిన ఓ కూలి ప్రమాదవశాత్తు సముద్రంలో జారిపడి గల్లంతయ్యాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కాకినాడ పోర్టు పోలీసులు బుధవారం రాత్రి ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ రేచర్లపేట రాచర్లవారి వీధికి చెందిన 37 ఏళ్ల రాచర్ల కృష్ణ పెయింటింగ్, కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి నుంచి యాంకరేజ్ పోర్టుకు వెళ్లి అక్కడి నుంచి బార్జిపై బస్తాల మోతకు వెళ్లాడు. 5 గంటలకు బయల్దేరిన కృష్ణ సముద్రంలో కొంత దూరం ప్రయాణించి ఓ సంస్థకు చెందిన బియ్యం బస్తాల బోటు నుంచి షిప్‌లోకి సరకు మారుస్తున్నాడు. రాత్రి 11 గంటలకు బోటు నుంచి నిచ్చెన సాయంతో షిప్‌లోకి ఎక్కుతున్న కృష్ణ ఒక్కసారిగా జారి సముద్రంలో పడిపోయాడు. దీంతో సహ కూలీలు బుధవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదుతో పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణకు 15 ఏళ్ల క్రితం వివాహం కాగా భార్య తలుపులమ్మతో పాటు 10, 12, 14 ఏళ్ల వయసులు ఉన్న ఇద్దరు మగపిల్లలు, ఓ ఆడపిల్ల ఉన్నారు.